క్లుప్తంగా

కురుణించు తల్లీ.. కనకదుర్గమ్మా

బద్వేలు అర్బన్ : కురుణించు తల్లీ.. కనకదుర్గమ్మ అంటూ భక్తులు వేడుకున్నారు. స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్ ఆవరణలోని సబ్‌జైలు సమీపంలో గల కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాఢమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారి జన్మనక్షత్రం సందర్భంగా బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన లక్ష కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే కనకదుర్గమ్మ అమ్మవారికి పుష్పాలతో చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు దర్శిసుబ్బరాజ, పబ్బతిచంద్రశేఖర్, వడ్లపూటినాగభూషణం, అశోక్‌కుమార్‌రెడ్డి, బీరంరవిశంకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

ఖాజీపేట : ఖాజీపేటలోని కెనరా బ్యాంక్ సేవలను రైతులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కడప లీడ్ బ్యాంక్ మేనేజర్ జనార్దనం సూచించారు. ఖాజీపేట మండలం ఏటూరు గ్రామంలో జన సురక్షా ఫైనాన్సియల్ ఇంక్లూసిన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కెనరా బ్యాంక్ అద్వితీయమైన సేవలు అందిస్తోందని కొనియాడారు. అలాగే కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం బీమా సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. రైతులు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్ సందీప్, ఫైనాన్సియల్ కౌన్సిలర్ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

పోరుమామిళ్ల : సీనియర్ రాజకీయ నాయకులు సుగవాసి బాలసుబ్రహ్మణ్యంను బుధవారం పోరుమామిళ్ల వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. డాక్టర్ కల్యాణ చక్రవర్తి, సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ ఆధ్వర్యంలో బాలసుబ్రహ్మణ్యంను సత్కరించి, మెమొంటో అందచేశారు. ఆయన్ను కలసిన వారిలో వైస్ ఎంపీపీ చెన్ను రాజశేఖర్, నాగేంద్రప్రసాద్, వెంకటనాయుడు, ఓబయ్య, హరిప్రసాద్, లక్ష్మణ్, గిరిప్రణీత్‌రెడ్డి, జగదీష్ రెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

కొత్త విద్యుత్ మీటర్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

ప్రొద్దుటూరు : 'సాక్షి' పత్రికలో ప్రచురితమైన 'ఇంటికి రూ.9150 విద్యుత్ బిల్లు' అనే వార్తకు అధికారులు స్పందించారు. మంగళవారం వార్త ప్రచురితం కాగా వెంటనే అధికారులు సుబ్బిరెడ్డి కొట్టాలలోని 7/135 నంబర్ గల ఇంటికి వెళ్లి ఆరా తీశారు. గత నెల విద్యుత్ బిల్లులో కేవలం రూ.502 మాత్రమే బిల్లు వచ్చిందని, ఈ నెలలోనే ఇంత పెద్ద మొత్తంలో బిల్లు వేశారని గృహ యజమాని తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది ఆ ఇంటికి ఉన్న పాత మీటర్‌ను తొలగించి కొత్త మీటర్‌ను ఏర్పాటు చేశారు.

పాఠశాల తనిఖీ

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని పూసలవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఉన్నత పాఠశాల, ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి బోధన, అభ్యసనా విధానాలు, విద్యార్థుల ప్రగతి, సామర్థ్యాల పెంపు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. పాఠశాలకు తరగతి గదుల కొరత ఉందని ఉపాధ్యాయులు డిప్యూటీ డీఈఓ దృష్టికి తీసుకెళ్ళగా వసతుల కల్పనకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.

టీడీపీ అకృత్యాలకు అడ్డుకట్ట వేస్తాం

- జిల్లాలో లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దువ్వూరు : టీడీపీ నాయకులు చేస్తున్న అకృత్యాలకు, అరచకాలకు అట్టుకట్ట వేస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని ఇడమడక గ్రామంలో రెండు రోజుల క్రితం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు ముద్దం వీరభద్రుడుకు చెందిన డాబాను టీడీపీ నాయకులు అధికారులతో కలసి అక్రమంగా కూల్చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డితో కలసి బాధితుడు వీరభద్రుడు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో, జిల్లాలో లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపై, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన సాగుతోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టకుండా కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధించే పనిలో ఉందన్నారు. సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించరని ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బంది పెడుతోందని ఆరోపించారు. నేషనల్ హైవేకు 20 మీటర్ల దూరంలో ఉన్న డాబాకు నేషనల్ హైవే వారు నోటీసులు ఇవ్వాలి కానీ, సంబంధం లేని రెవెన్యూ శాఖ వారు నోటీసులు ఇచ్చి ఒక్క రోజులోనే డాబాను కూల్చివేయడం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుకు నిదర్శనమన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆత్మ సంతృప్తి కోసం అధికారులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం, మైదుకూరు ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ శాశ్వతం కాదన్నారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో చట్టప్రకారం పనిచేసి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రెడ్ బుక్ రాజ్యాంగానికి ప్రత్యక్ష సాక్ష్యం ఇది

మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తున్నదానికి ప్రత్యక్ష సాక్ష్యం ఇడమడక గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త వీరభద్రుడుకు జీవనాధారమైన డాబాను కూల్చడమేనన్నారు. వీరభద్రుడు 30 ఏళ్లుగా డాబా పెట్టుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. డాబా నేషనల్ హైవే పక్కన ఉందన్న సాకుతో కక్షపూరితంగా టీడీపీ ఎమ్మెల్యే అతని అనుచరులు చెప్పారని రెవెన్యూ, పోలీసు అధికారులు కూల్చడం దారుణమన్నారు. దువ్వూరు, మైదుకూరులో కేసీ కెనాల్ కట్టను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో కక్ష సాధింపు చర్యలు చేపట్టలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులు, దౌర్జన్యాలను చేస్తున్నారని అన్నారు. అధికారులు చట్ట ప్రకారం నడుచుకుని ప్రజలకు న్యాయం చేయాలి కానీ రాజకీయ నాయకుల మాటలు విని అధికారులు ప్రజలను వేధిస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వం శాశ్వతం కాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రభుత్వ మాజీ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, మాజీ జెడ్పీటీసీ గోపిరెడ్డి బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, వ్యవసాయ మండలి మాజీ చైర్మన్ ఓబుళకొండారెడ్డి, మాజీ ఎంపీపీ విజయగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొంతపల్లె వెంకటసుబ్బారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, నగరి శ్రీకాంత్, మద్దిలేటి రెడ్డి, గుర్రాల రామమునిరెడ్డి, సానేపల్లి కిరణ్‌కుమార్‌రెడ్డి, వేమిరెడ్డి ఓబుళరెడ్డి, ముడుమాల శివశంకర్‌రెడ్డి, మార్లెళ్ల రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు మాబు షరీఫ్, రాజగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

గోపవరం : మండలంలోని బుచ్చనపల్లె గ్రామంలో ఉన్న షిరిడి సాయినాథ మహరాజ్ స్వామివారి ఆలయంలో గురుపౌర్ణమి పర్వదిన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం స్వామివారికి ప్రత్యేక అభిషేకం అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కూకట్లపల్లె వెంకమ్మ, నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. 10వ తేదీ గురువారం గురుపౌర్ణమి వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రికి చెక్కభజన పోటీలు ఉంటాయని, విజేతలుగా నిలిచిన భజన బృందాలకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.20 వేలు అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.


స్వామికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా గ్రామోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని దొరసానిపల్లె సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా బుధవారం సాయిబాబా గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. వేకువ జామున సాయిబాబా విగ్రహానికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయిబాబా ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఆశీనులను చేసి పుర వీధుల్లో చెక్కె భజనలు, డప్పు వాయిద్యాల మధ్య వైభవంగా ఊరేగించారు.

కులమతాలకతీతంగా మొహర్రం వేడుకలు

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులో బుధవారం కులమతాలకతీతంగా మొహర్రం వేడుకలు నిర్వహించారు. గత వారం రోజుల క్రితం చావిడిలో కొలువు దీరిన పీర్లకు చిన్న కరకత్తు, పెద్ద సరకత్తు కార్యక్రమాలను పూర్తి చేసి బుధవారం సాయంత్రం అగ్ని గుండ ప్రవేశం చేసి పీర్లను ఏటికి సాగనంపారు. కులమతాలకతీతంగా గ్రామంలోని ప్రజలందరూ పీర్ల పండుగలో పాల్గొన్నారు. రంగులు చల్లుకుంటూ, తప్పెట్ల శబ్దాల నడుమ చిందులేస్తూ అన్ని వయస్సుల ద్వారా ఆనందంగా పండుగ జరుపుకున్నారు. మహిళలందరూ పెద్ద ఎత్తున పాల్గొని మొహర్రం వేడుకలను ఆసక్తిగా తిలకించారు.

పోరుమామిళ్ల : పీర్లపండుగ సందర్భంగా పట్టణంలోని ఉద్దికట్టవీధిలో మౌలాలి స్వామి దర్గాలో బుధవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి చక్కెర చదివింపులు చేశారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ సీయం బాషా, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు రాజీవ్‌బాషా, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరి రాళ్లపల్లె నరసింహులు, మైనారిటీ సెల్ అధ్యక్షులు మస్తాన్, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు సాయి నారాయణరెడ్డి, కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.


మౌలాలిస్వామి దర్గాలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

ప్రత్యేక పూజలు

పీర్ల పండుగ సందర్భంగా పోరుమామిళ్ల ఉద్దికట్ట వీధి మౌలాలిస్వామి దర్గా నిర్వాహకులు, కవలకుంట్ల పెద్ద పీరయ్యస్వామి దర్గా కమిటీ సభ్యులు, సర్పంచ్ పీరయ్య ఆహ్వానం మేరకు బుధవారం వైఎస్సార్‌సీపీ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆహ్లాదకర వాతావరణంలో పీటీఎం

అట్లూరు : మెగా పేరెంట్ టీచర్ మీట్ (పీటీఎం)ను ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించాలని అదనపు ప్రాజెక్టు అధికారి నిత్యానందరాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని అట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు స్థానిక కస్తూర్బాగాంధీ గురుకుల బాలికల విద్యాలయలాన్ని ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గురువారం మెగా పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

పోరుమామిళ్ల: మెగా పేరెంట్ టీచర్ మీట్ పండుగ వాతావరణంలో నిర్వహించాలని ఏఏఎంఓ విజయభాస్కరుడు తెలిపారు. బుధవారం ఆయన పుల్లివీడు మోడల్ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం ఆయన పోరుమామిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఈదుళ్లపల్లె, కమ్మవారిపల్లె, పోరుమామిళ్ల మెయిన్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

మైదుకూరు : మరమ్మతుల కారణంగా మైదుకూరులోని తెలుగు గంగ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో నాలుగు రోజుల పాటు పగటి పూట విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రామభద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు గంగ కాలనీ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్లలో త్రీ ఫేస్ విద్యుత్‌ను రైతులకు గురువారం నుంచి ఆదివారం వరకు రాత్రి 2 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు ఇవ్వడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సబ్ స్టేషన్ పరిధిలోని సరస్వతి పేట, రాయప్పగారిపల్లె, అన్నలూరు గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

కేటగిరి-2 కింద మార్చుకోండి

మైదుకూరు : మైదుకూరు పట్టణం, మండలంలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ల యజమానులు తమ విద్యుత్ కనెక్షన్లను కేటగిరి-2 కింద మార్చుకోవాలని మైదుకూరు ట్రాన్స్‌కో డీఈఈ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వాటర్ ప్లాంట్ల విద్యుత్ కనెక్షన్లు కేటగిరి-3 కింద ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దీని వల్ల బిల్లింగ్‌లో తేడా వస్తూ సంస్థకు నష్టం వాటిల్లుతోందని తెలిపారు. తాము తనిఖీలు చేసి అపరాధ రుసుం వేయకముందే ఎవరికి వారు స్వచ్ఛందంగా తమ ప్లాంట్ విద్యుత్ కనెక్షన్‌ను కేటగిరి-2 కింద మార్చుకోవాలని సూచించారు.

సదస్సును జయప్రదం చేయండి

బద్వేలు అర్బన్ : కర్నూలులో ఈ నెల 12, 13వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి తెలుగుభాషా పరిరక్షణ సదస్సుకు భాషాభిమానులు అందరూ హాజరై జయప్రదం చేయాలని తెలుగుభాషా వికాస ఉద్యమ జిల్లా అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు సీక్యాంపు పీజీవీ కళాక్షేత్రంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా మండలి బుద్ధప్రసాద్, ముక్తేశ్వరరావు, తూమాటి సంజీవరావు, టి.జి.వెంకటేష్, రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి తదితరులు హాజరవుతున్నారని తెలిపారు.

పరామర్శ

అట్లూరు : ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది స్వగ్రామానికి వచ్చిన అట్లూరు మాజీ జెడ్పీటీసీ అందూరు రామకృష్ణారెడ్డిని బుధవారం ఆయన స్వగృహంలో మాజీ పీఆర్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి పరామర్శించారు. ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బి.కోడూరు : గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌లు పేర్కొన్నారు. బుధవారం బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల 9వ తేదీన పీహెచ్‌సీలో పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమం జరుగుతుందని, గర్భిణులకు తప్పక ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. గర్భిణులకు అన్నిరకాల పరీక్షలు జరిపి హైరిస్క్ ఉన్న గర్భిణులను గుర్తించి తగు సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గర్భిణులు క్రమం తప్పకుండా గర్భవతిగా నమోదు అయిన వెంటనే టీకాలు వేయించుకుని ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇచ్చే ఐరన్ మాత్రలు వాడాలన్నారు. అందరూ తప్పక 108 వాహనం ఉపయోగించుకుని ప్రభుత్వాసుపత్రిలో కాన్పు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమానికి వచ్చిన 32 మంది గర్భిణులకు పూర్వపు 104 వాహన వైద్యాధికారి డాక్టర్ షఫి భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పుష్పాంజలి, ఆప్తాల్మిక్ ఆఫీసర్ హుస్సేనయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు జాన్‌విలియం, విజయలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్, వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.


గర్భిణులకు భోజనం వడిస్తున్న వైద్య సిబ్బంది

అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు

బద్వేలు అర్బన్ : కార్యకర్తలకు అండగా ఉంటామని, అధైర్య పడొద్దని వైఎస్సార్‌సీపీ నాయకులు భరోసా ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డులో గల సురేంద్రనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పసుపుల వెంకటరత్నం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ బూత్‌విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు వెంకటరత్నం కుటుంబానికి బుధవారం రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ విభాగం కార్యవర్గ సభ్యులు లక్ష్మిరెడ్డి, పట్టణ కార్యదర్శి పోలిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రయాదవ్, ఈగర వీంద్రనాథ్ రెడ్డి పసుపుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వెంకటరత్నం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పంటల బీమా చేయించుకోవాలి

కాశినాయన : రైతులు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని వ్యవసాయాధికారి చంద్రమోహన్ తెలిపారు. బుధవారం మండంలోని వద్దమాను, చిన్నాయపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వర్షాధారం కింద ఎక్కువగా పత్తి పంటను సాగు చేస్తుంటారని, పంటకు వాతావరణం ఆధారంగా బీమా చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలను గ్రామ సచివాలయ వీఏఏను సంప్రదించాలని తెలిపారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

ఖాజీపేట : రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని, వాటి వల్ల భూమిలోని లోపాలను తెలుసుకోవచ్చని కేవీకే శాస్త్రవేత్తలు అంకయ్య, కుమారి రైతులకు సూచించారు. మిడుతూరు, భూమాయపల్లె గ్రామాల్లో ఏవో నాగార్జున ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో నాగార్జున, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియాన్ని చెల్లించాలి

మైదుకూరు : రైతులు అనుమతి పొందిన పంటలకు పంటల బీమా చెల్లించాలని మండల వ్యవసాయాధికారి బాలగంగాధర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గంజికుంట, లెక్కలవారిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

చాపాడు : అన్నదాత సుఖీభవ పథకం క్రింద అర్హులు కాని వారు రైతు సేవా కేంద్రాల్లో ఫిర్యాదులు చేసుకోవాలని ఏడీఏ కృష్ణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని మొర్రాయిపల్లె, సోమాపురం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమాపురంలోని రైతు సేవా కేంద్రంలో అన్నదాత సుఖీభవ పథకం క్రింద అర్హులైన వారి జాబితాను ప్రచురించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ జాబితాలో పేర్లు లేని రైతులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

విద్యార్థులను ఆదుకోవడం అభినందనీయం

బద్వేలు అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఆదుకునేందుకు తిరుమల ట్రస్టు చేస్తున్న సేవలు అభినందనీయమని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ నయీమ్‌అలీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సురేంద్రనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బెంగళూరుకు చెందిన తిరుమల ట్రస్టు సహకారంతో విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా పేద విద్యార్థులను ఆదుకునేందుకు తిరుమల ట్రస్టు వారు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులు దాతలు అందించిన సహకారాలను అందిపుచ్చుకుని కష్టపడి చదివి మంచి ప్రయోజకులుగా తయారు కావాలని కోరారు. అలాగే ప్రతి విద్యార్థి మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ శేషయ్య, ఎఫ్‌ఎస్‌ఓ ఖాజావలి, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కె.వి.సుబ్బారావు, అవోపా సెక్రటరీ నాగేశ్వర్‌రావు, ఆర్యవైశ్య సంఘం నాయకులు సురేష్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బరాజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికీ బదిలీ సర్వసాధారణం

మైదుకూరు : ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమని ఎంపీటీసీ పెద్దిరెడ్డి లక్ష్మీదేవి అన్నారు. మండలంలోని ఎస్.ఎర్రబల్లె గ్రామ సచివాలయంలో పనిచేస్తూ బదిలీపై వెళుతున్న సిబ్బందికి బుధవారం స్థానిక ప్రజా ప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. సచివాలయంలో పనిచేస్తున్న పలువురు సిబ్బంది ఇతర మండలాలకు బదిలీ అయ్యారు. బుధవారం ఎంపీటీసీ పెద్దిరెడ్డి లక్ష్మీదేవి, సర్పంచ్ గోవిందమ్మ, నాయకులు దశరథరామిరెడ్డి, నారాయణ సచివాలయ సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఐదేళ్లుగా సచివాలయ పరిధిలోని ప్రజలకు ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

రాజుపాళెం : ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాలమద్దిలేటి తెలిపారు. మండలంలోని వెలవలి గ్రామంలో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ఫ్యాక్షన్, గంజాయి తదితర అంశాలపై బుధవారం సాయంత్రం సీఐ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా ఓటీపీ చెప్పాలని ఫోన్ వచ్చినా, లింక్‌లు వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వారికి ఇవ్వొద్దని సూచించారు. మహిళలు విలువైన ఆభరణాలు ధరించినప్పుడు, ఇంటి వద్ద బంగారు వస్తువులు, డబ్బులు దాచుకోవడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎస్ఐ వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో గంజాయి, గుట్కా ఉండకూడదని తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను హరిస్తే చూస్తూ ఊరుకోం

నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మిక, ఉద్యోగ సంఘాలు దేశవ్యాప్తంగా బుధవారం సమ్మె నిర్వహించాయి. ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లో నిర్వహించిన సమ్మెలో వివిధ రంగాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు సమ్మెలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరిస్తే చూస్తూ ఊరుకోమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. – సాక్షి, నెట్‌వర్క్


కలసపాడులో..


ప్రొద్దుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు


మైదుకూరు : ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు



రాజుపాలెం: మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు డేవిడ్ రాజు


గోపవరం : ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు


ప్రొద్దుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు


కాశినాయన : డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు


అట్లూరు క్రాస్‌రోడ్డులో..


పోరుమామిళ్లలో..


బద్వేలు అర్బన్: ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు